సాక్షి
చిత్తూరు
శనివారం । 14 । డిసెంబర్ । 2024



అచ్చార్ల చెరువు మొరవకు గండి

రొంపిచెర్ల మండలంలోని మోటుమల్లెల పంచాయతీ వంకిరెడ్డిగారిపల్లెకు సమీపంలోని అచ్చార్ల చెరువు మొరవ తెగింది. - 8లో



శత 'సంకల్ప'ం

విద్యార్థుల విద్యాభివృద్ధికి, శతశాతం ఉత్తీర్ణతకు ఇంటర్మీడియట్ విద్యాశాఖ సంకల్ప్ కార్యక్రమం అమలు చేస్తోంది. - 8లో



చదరంగ రారాజు గుకేశ్

చిత్తూరు జిల్లాకు చెందిన గుకేశ్ చదరంగ రారాజుగా అవతరించడం జిల్లాకే గర్వకారణమని బాలాజీ అన్నారు. - 8లో

న్యూస్‌రీల్

గతంలో బాబునెందుకు అరెస్టు చేయలేదు

– వైఎస్సార్‌సీపీ మాజీ ఎంపీ రెడ్డెప్ప



మాజీ ఎంపీ రెడ్డెప్ప

చిత్తూరు కలెక్టరేట్ : ''గతంలో రాజమండ్రి పుష్కరాలకు ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబునాయుడు విచ్చేసినప్పుడు జరిగిన తొక్కిసలాటలో 29 మహిళలు మృతి చెందారు. ఆనాడు ఆయన్ని ఎందుకు అరెస్టు చేయలేదు'' అని చిత్తూరు మాజీ ఎంపీ రెడ్డెప్ప ప్రశ్నించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల హైదరాబాద్ సంధ్య థియేటర్‌లో జరిగిన తొక్కిసలాటలో ఒక మహిళ మృతి చెందడం బాధాకరమన్నారు. బాధిత కుటుంబానికి హీరో అల్లుఅర్జున్ పరిహారం అందజేశారని తెలిపారు. ఈ ఘటనలో కేసు నమోదు చేసి, నెమ్మదిగా చర్యలు తీసుకునే అవకాశం ఉన్నప్పటికీ కుట్రపన్ని ఆయన్ని అరెస్టు చేశారని ఆరోపించారు. రాజమండ్రి పుష్కరాల్లో జరిగిన తొక్కిసలాటకు అప్పటి సీఎం చంద్రబాబే బాధ్యులని అన్నారు. ఆ ఘటనకు కారణమైన చంద్రబాబును ఎన్నిసార్లు అరెస్టు చేయాలని ప్రశ్నిస్తున్నట్లు తెలిపారు. చంద్రబాబుకు ఒక చట్టం, ఇతరులు మరో చట్టం ఉండకూడదని అన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 20 మందికి జరిమానా

చిత్తూరు అర్బన్: మద్యం తాగి వాహనాలు నడిపిన 20 మందికి రూ.2 లక్షల జరిమానా విధిస్తూ చిత్తూరులోని ప్రిన్స్‌పల్ జూనియర్ సివిల్ జడ్జి ఉమాదేవి శుక్రవారం తీర్పునిచ్చారు. చిత్తూరు ట్రాఫిక్ సీఐ నిత్యబాబు గత రెండు రోజులుగా వాహనాలు తనిఖీ చేస్తుండగా పలువురు మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించారు. మొత్తం 20 మందిపై కేసు నమోదు చేసి, కోర్టులో హాజరుపరిచారు. ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున మొత్తం రూ.2 లక్షల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

మోడల్ పేపర్లు ఉపయోగకరం



మోడల్ పేపర్ల పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ విద్యాధరి

చిత్తూరు కలెక్టరేట్ : పదో తరగతి విద్యార్థులకు మోడల్ పేపర్లు ఉపయోగకరమని ఇన్‌చార్జ్ కలెక్టర్ విద్యాధరి అన్నారు. శుక్రవారం క్యాంప్ కార్యాలయంలో యూటీఎఫ్ నాయకులు రూపొందించిన పదో తరగతి మోడల్ పేపర్ల పుస్తకాన్ని ఆమె ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థుల కోసం యూటీఎఫ్ సంఘం చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో మరింత పేద విద్యార్థులకు ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. డీఈఓ వరలక్ష్మి మాట్లాడుతూ యూటీఎఫ్ నాయకులు రూపొందించిన మోడల్ పేపర్ల పుస్తకం చాలా బాగుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి జీవీ రమణ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సోమశేఖరనాయుడు, మణిగండన్, సహాధ్యక్షులు రెడ్డెప్పనాయుడు, రెహానాబేగం, నాయకులు ఎస్పీ బాషా, సరిత, పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

కాల 'కూటమి' దగాపై కడుపు మండిన కర్షకుడు దండెత్తాడు.. అన్నదాతకు అండగా వైఎస్సార్ సీపీ నిలిచింది. అందని అన్నదాత సుఖీభవ.. పంట నష్ట పరిహారం.. చెల్లించని బీమా ప్రీమియం తదితరాలు అమలు చేయకపోవడంతో నయవంచనకు గురైన పుడమి పుత్రుడిని ఆదుకోవడానికి జగనన్న పిలుపు మేరకు వారికి అండగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో 'అన్నదాతకు అండగా' కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని గిరింపేట వద్ద ఉన్న పూలే భవనం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమం సాగిన తీరు ఇలా..



చిత్తూరులో ర్యాలీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

దగాపై దండయాత్ర

అన్నదాత ఆక్రోశం

- అన్నదాతకు అండగా ర్యాలీకి విశేష స్పందన
- అధిక సంఖ్యలో తరలివచ్చిన రైతులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు
- పూలే భవనం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ
- పాల్గొన్న మాజీ ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు
- రైతుల డిమాండ్లు పరిష్కరించాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ విద్యాధరికి వినతిపత్రం

చిత్తూరు కలెక్టరేట్/చిత్తూరు కార్పొరేషన్: కర్షకులకు వెన్నుదన్నుగా వైఎస్సార్ సీపీ నిర్వహించిన అన్నదాతకు అండగా కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. చిత్తూరు గిరింపేటలోని పూలే భవనం నుంచి కలెక్టరేట్ వరకు చిత్తూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ విజయానందరెడ్డి ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టారు. ర్యాలీలో చిత్తూరు మాజీ ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు విజయానందరెడ్డి, వెంకటేగౌడ, కృపాలక్ష్మి, సునీల్‌కుమార్, నగర డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, జిల్లా మహిళా విభాగం మాజీ అధ్యక్షురాలు గాయత్రీదేవి, నగర పార్టీ అధ్యక్షుడు జ్ఞానజగదీష్, మాజీ ఎమ్మెల్యే లలితకుమారి, జెడ్పీ మాజీ చైర్మన్ కుమారరాజా, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, మహిళా విభాగం జిల్లా కార్యదర్శి గౌహతి, రైతు సంఘం నేతలు కృష్ణారెడ్డి, పరమేశ్వరరెడ్డి, ప్రహ్లాద, నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్పొరేటర్లు లీనారెడ్డి, సూర్యప్రతాప్‌రెడ్డి, సరళామేరి, కేపీ శ్రీధర్, నారాయణ, త్యాగ, ఆను, రాజారత్నంరెడ్డి, రాజేష్‌రెడ్డి, అన్బు, ప్రతిమ, మనోజ్‌రెడ్డి, వేల్కూరు బాబురెడ్డి, మునిరాజారెడ్డి, తులసీయాదవ్, హేమలత, సురేష్‌రెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, మణి, సరిత జనార్దన్, శిరీష్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, బాబురెడ్డి, హరిరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, జయచంద్రారెడ్డి, గోవిందస్వామి, సుధాకర్‌రెడ్డి, అంజలి, భాగ్యలక్ష్మి, రజనీకాంత్, మధుసూదన్, సుగుణశేఖర్‌రెడ్డి, ప్రకాష్, శేఖర్, చల్లముత్తు, లక్ష్మణస్వామి, యువరాజ్, బాగారెడ్డి, దీప, శుభ, అనిల్, వేణురాజు, శ్యామ్‌లాల్, మునికృష్ణారెడ్డి, అప్పాజీ, మురళీరెడ్డి, చక్రీ, ప్రసన్న, స్టాన్లీ, చాంద్‌బాషా, శివ, అల్తాఫ్ పాల్గొన్నారు.

రైతుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

కర్షకులు, వైఎస్సార్‌సీపీ నేతలు ఇన్‌చార్జి కలెక్టర్ విద్యాధరిని కలిసి వినతిపత్రం అందజేశారు. రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. క్షేత్రస్థాయిలో రైతులు ఎదుర్కొంటున్న దయనీయ పరిస్థితులను ఆమె దృష్టికి తీసుకెళ్లారు.



ర్యాలీలో పాల్గొన్న మహిళలు

నిరసన గళం వినిపించి..

జిల్లా కేంద్రంలో వైఎస్సార్ సీపీ చేపట్టిన ర్యాలీకి అనేక ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో కర్షకులు తరలివచ్చి, ప్లకార్డులతో చేతపట్టి కూటమి సర్కారుపై నిరసన గళం వినిపించారు. పూలే భవనం నుంచి కలెక్టరేట్ వరకు జరిగిన ర్యాలీలో రైతులతో కలిసి వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జులు, నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. చిత్తూరు, గంగాధరనెల్లూరు, నగరి, పూతలపట్టు, పలమనేరు, పుంగనూరు, కుప్పం నియోజకవర్గాల నుంచి అధిక సంఖ్యలో రైతులు, నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి, అన్నదాతకు అండగా కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

ర్యాలీకి కూటమి మోకాలడ్డు

శాంతియుతంగా రైతుల సమస్యలను పరిష్కరించాలని వైఎస్సార్ సీపీ చేపట్టిన అన్నదాతకు అండగా ర్యాలీని అడ్డుకునేందుకు కూటమి నేతలు ప్రయత్నించారు. ర్యాలీ విషయాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు ముందస్తుగానే పోలీసులకు తెలిపా రు. అయితే ఉద్దేశపూర్వకంగా టీడీపీ, జనసేన నేతలు వైఎస్సార్‌సీపీ ర్యాలీ చేపట్టిన సమయంలోనే బైక్ ర్యాలీ చేపట్టి అడ్డుకునేందుకు ప్రయత్నించారు. ఆర్డీఓ కార్యాలయం వరకు మాత్రమే అనుమతి ఉన్న కూటమి ర్యాలీలో కొంత మంది నాయకులు, కార్యకర్తలు బైకులపై కలెక్టరేట్ వర కు వెళ్లారు. కాగా పోలీసులు గిరింపేట సర్కిల్, దుర్గమ్మ గుడి, పీవీకేఎస్ కళాశాల ప్రాంతాల్లో బందోబస్తు చేపట్టి ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు చేపట్టారు. టీడీపీ నాయకుల కుట్రతో ఉదయం 10 గంటలకు నిర్వహించాల్సిన ర్యాలీ గంట ఆలస్యంగా ప్రారంభించాల్సి వచ్చింది. అధిక సంఖ్యలో విచ్చేసిన రైతులను, పార్టీ శ్రేణులను కలెక్టరేట్ వద్ద లోనికి వెళ్లనివ్వకుండా పోలీసులు అడ్డుకున్నారు. కొంత మంది పార్టీ నాయకులను మాత్రమే వినతిపత్రం అందజేసేందుకు లోనికి అనుమతిచ్చారు. పోలీసులు బందో బస్తు పేరుతో హంగామా సృష్టించారు. కాగా వైఎ స్సార్‌సీపీ ఎల్లప్పుడూ రైతులకు అండగా ఉంటుందని ర్యాలీలో పాల్గొన్న పలువురు నేతలు వెల్లడించారు. ఎవరేమన్నారంటే..



బందోబస్తు విధులు నిర్వహిస్తున్న పోలీసులు



ఇన్‌చార్జ్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కుట్రలు మాని.. హామీలు అమలు చేయండి



ప్రతిపక్ష నేతలపై అక్రమ కేసులు పెట్టి అరెస్టులు చేసే కుట్రలు మాని రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నాం. ప్రతిపక్ష నాయకుల అక్రమ అరెస్టులను ఆపాలి. రైతుల సంక్షేమంపై శ్రద్ధ చూపాలి. అన్నదాతలను కూటమి సర్కారు ఆదుకోవాలి.

– గౌహతిరెడ్డి, మహిళా విభాగం జిల్లా కార్యదర్శి, వైఎస్సార్‌సీపీ

పోరాటాలు ఉధృతం చేస్తాం



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో రైతులకు అన్నదాత సుఖీభవ అందించలేదు. చంద్రబాబు రైతులను ఆదుకుంటామని చెప్పి, మోసం చేస్తున్నారు. గిట్టుబాటు ధర హామీలు కలగానే మిగిలిపోతున్నాయి. రైతులకు న్యాయం చేయకపోతే పోరాటాలు ఉధృతం చేస్తాం.

– గాయత్రీదేవి, మహిళా విభాగం జిల్లా మాజీ అధ్యక్షురాలు, చిత్తూరు

బాబుది రైతు కుటుంబమే కదా!



రైతు కుటుంబం నుంచి వచ్చిన సీఎం చంద్రబాబుకు కర్షకుల సమస్యలు పట్టకపోవడం బాధాకరం. రైతుల గోడును కూటమి సర్కారు విస్మరించింది. కూటమి అధికారంలోకి వచ్చిన గత ఆరు నెలల్లో నాలుగుసార్లు తుపానులు వచ్చాయి. జిల్లాలోని వేలాది మంది రైతులకు పంట నష్టం వాటిల్లింది. ఇప్పటివరకు పంట నష్టపరిహారం ఇవ్వకపోవడం దారుణం.

– రెడ్డెప్ప, మాజీ పార్లమెంట్ సభ్యుడు, చిత్తూరు

జగనన్నను తలుచుకుంటున్నారు



జగనన్న ఇచ్చిన హామీలు నెరవేర్చి, మేలు చేశారని ప్రజలు తలుచుకుంటున్నారు. ప్రస్తుతం క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నప్పుడు గతంలో అందుకున్న మేలును లబ్ధిదారులు మాతో పంచుకుంటున్నారు. అనవసరంగా కూటమి ప్రభుత్వానికి అవకాశం ఇచ్చి, తప్పు చేశామన్న భావన అన్ని వర్గాల్లో భావన కనిపిస్తోంది.

– భరత్, ఎమ్మెల్సీ, చిత్తూరు

అమరావతి రైతులే కనిపిస్తారా?



చంద్రబాబుకు అమరావతి రైతులే కనిపిస్తారా? అని ప్రశ్నిస్తున్నాం. జిల్లాల్లోని రైతులు కష్టాలు పడుతుంటే వారి గోడు ఎందుకు వినిపించడం లేదని అడుగుతున్నాం. మామిడి పంటకు గిట్టుబాటు ధర ఇవ్వకపోవడంతో కర్షకులు నష్టపోతున్నారు. ఆర్థికసాయం వెంటనే అందించాలి. తడిచిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేయాలి.

– విజయానందరెడ్డి, వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్

మోసాల మాంత్రికుడు బాబు



హామీలను అమలు చేయకపోవడంతో చంద్రబాబు మోసాల మాంత్రి కుడు అయ్యారు. అన్నదాత సుఖీభవ పేరుతో రైతులను ఆదుకుంటామని చెప్పి లక్షలాది మందిని మోసం చేశారు. ఏమార్చడంలో ఆయనకున్న అనుభవం ఇంకెవరికీ లేదు. **– వెంకటేగౌడ, మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ పలమనేరు నియోజకవర్గ ఇన్‌చార్జ్**

అవసరం తీరిపోయిందనే ధోరణి



గెలిచిన తరువాత అవసరం తీరిపోయిందనే ధోరణిలో కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోంది. ఎన్నికల సమయంలో రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటామని ఊదరగొట్టారు. అధికారంలో వచ్చాక అవసరం తీరిపోవడంతో రైతులు, ప్రజలను పట్టించుకోవడం లేదు.

– సునీల్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ పూతలపట్టు నియోజకవర్గ ఇన్‌చార్జ్

పెట్టుబడి సాయం ఎప్పుడిస్తారు?



రైతులకు ఇవ్వాల్సిన పెట్టుబడి సాయం ఇంకెప్పుడిస్తారని టీడీపీ కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాం. అన్నం పెట్టే అన్నదాతకు అన్యాయం చేసే భవిష్యత్ ఉండదన్న విషయం గుర్తించాలి. రైతులకు ఇస్తామన్న రూ.20 వేలు పెట్టుబడి సాయం వెంటనే మంజూరు చేయాలి. ఈ రైతులకు తీరని అన్యాయం జరుగుతోంది.

– కృపాలక్ష్మి, వైఎస్సార్‌సీపీ గంగాధరనెల్లూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్

వైభవం.. కార్తీక దీపోత్సవం





వరసిద్ధి వినాయకస్వామి ఆలయం, మణికంఠేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం కార్తీక దీపోత్సవం వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు వేదమంత్రాలు పఠిస్తూ..దీపారాధన చేశారు. ఆలయ ఆవరణమంతా దీపాలతో నింపారు. ఈఓ పెంచల కిషోర్, ఏఈఓ రవీంద్రబాబు, పర్యవేక్షకులు కోదండపాణి, సిబ్బంది చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు. **- కాణిపాకం**

రాజకీయదాడులు అనైతికం

- టీడీపీ నేతలపై హత్యాయత్నం కేసుకు డిమాండ్
- కడపలో 'సాక్షి' ప్రతినిధులపై దాడిని ఖండించిన పాత్రికేయులు
- చిత్తూరు కలెక్టరేట్ వద్ద నిరసన.. నిందితుల అరెస్టుకు కలెక్టర్‌కు వినతి





చిత్తూరు కలెక్టరేట్ ఎదుట జర్నలిస్టుల నిరసన, ఇన్‌చార్జ్ కలెక్టర్ విద్యాధరికి వినతిపత్రం ఇచ్చి, చర్చిస్తున్న జర్నలిస్టు సంఘ నాయకులు

చిత్తూరు అర్బన్: ప్రజాస్వామ్యంలో నిజానిజాలను బయటపెట్టడానికి పనిచేస్తున్న పాత్రికేయులపై రాజకీయ పార్టీ నేతలు దాడులు చేయడం అనైతికమని ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) జిల్లాఅధ్యక్షుడు ఎం.లోకనాథన్ అన్నారు. ఇలాంటి దాడులు ప్రజాసామ్యంపై గొడ్డలిపెట్టులాంటివని ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్సార్ కడప జిల్లా వేముల తహసీల్దార్ కార్యాలయం వద్ద సాగునీటి సంఘాల ఎన్నికల కవరేజీకి వెళ్లిన సాక్షి మీడియా ప్రతినిధులపై దాదాపు 50 మంది టీడీపీ మూకలు దాడులకు పాల్పడిన ఘటనపై కదం తొక్కుతూ చిత్తూరులో ఏపీయూడబ్ల్యూజే జిల్లా శాఖ, చిత్తూరు ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. శుక్రవారం చిత్తూరు కలెక్టరేట్ వద్ద నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాత్రికేయులు పాల్గొని, నిరసన వ్యక్తం చేశారు. లోకనాథన్ మాట్లాడుతూ ఇటీవల రాష్ట్రంలో పాత్రికేయులపై జరుగుతున్న వరుస దాడులు ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. విధి నిర్వహణలో భాగంగా న్యూస్ కవరేజీ కోసం వెళ్లిన 'సాక్షి' మీడియా ప్రతినిధులు శ్రీనివాస్, రాజారెడ్డి, రాములపై అక్కడి టీడీపీ నాయకులు రాళ్లు, కర్రలతో మూకుమ్మడిగా దాడులకు పాల్పడటం అత్యంత హేయమైన చర్యగా అభివర్ణించారు. ఇలాంటి ఘటనలు ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టన్నారు. రాజ్యాంగం కల్పించిన భావ వ్యక్తీకరణ హక్కును కాలరాస్తూ టీడీపీ నేతలు పాత్రికేయులపై దాడులకు తెగబడడం మంచిదికాదన్నారు. ప్రభుత్వం సైతం ఇలాంటి ఘటనల్లో నిందితులను వెనకేసుకునిరాకుండా నిష్పక్షపాతంగా వ్యవహరించి, దాడులు చేసిన వారిపై చట్టరీత్యా చర్యలకు ఆదేశించాలన్నారు. దాడి చేసిన టీడీపీ నేతలపై హత్యాయత్నం కింద కేసు నమోదు చేసి, 24 గంటల్లో నిందితులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు జి.రమేష్‌బాబు, ఉపాధ్యక్షుడు టి.శివప్రసాద్, ఏపీయూడబ్ల్యూజే జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కెఎం.అశోక్‌కుమార్, సీనియర్ పాత్రికేయులు మహేష్, గజపతి, సురేంద్రరెడ్డి, శివకుమార్, హరీష్, చంద్రప్రకాష్, అయ్యప్పనాయుడు, చంద్ర, తేజ, రాజేష్, శ్రీనివాసులు, జయకుమార్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతల ఖండన..

మరోవైపు 'సాక్షి' ప్రతినిధులపై జరిగిన దాడిని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తప్పు పట్టారు. కలెక్టరేట్ వద్ద అన్నదాతలకు అండగా కార్యక్రమం నిర్వహించిన అనంతరం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కేజేఆర్ భరత్, మాజీ ఎంపీ రెడ్డెప్ప, చిత్తూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఎంసీ విజయానందరెడ్డి, పూతలపట్టు, గంగాధరనెల్లూరు, పలమనేరు నియోజకవర్గాల ఇన్‌చార్జిలు డాక్టర్ సునీల్, కృపాలక్ష్మి, వెంకటేగౌడ ఈ దాడిని తీవ్రంగా ఖండించారు. నిందితులను చంద్రబాబు నాయుడు వెనకేసుకునిరాకూడదన్నారు. దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేసేలా పోలీసుశాఖను ప్రభుత్వం ఆదేశించాలన్నారు.

కలెక్టర్‌కు వినతి..

దాడి ఘటనలో నిందితులపై చట్టరీత్యా చర్యలు కోరుతూ పాత్రికేయులంతా కలిసి చిత్తూరు ఇన్‌చార్జ్ కలెక్టర్ విద్యాధరికి వినతిపత్రం అందజేశారు. ఇటీవల పాత్రికేయులపై జరిగిన పలు దాడుల గురించి ఆమెకు వివరించారు. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా నిందితులపై కఠినంగా వ్యవహరించాలన్న తమ డిమాండ్‌ను ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని కోరారు. దీనిపై ఇన్‌చార్జి కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ.. పాత్రికేయుల విన్నపాన్ని ప్రభుత్వానికి పంపుతామన్నారు.

క్లుప్తంగా

మొగిలిఘాట్‌లో అంబులెన్స్ బోల్తా


మొగిలి ఘాట్‌లో బోల్తా పడిన అంబులెన్స్

పలమనేరు: ప్రమాదాలకు నిలయంగా మారిన మొగిలి ఘాట్‌లో శుక్రవారం ఓ ప్రైవేటు అంబులెన్స్ అతివేగంగా వెళ్లి అదుపుతప్పి బోల్తా పడిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలు మినహా ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఇటీవల కాలంలో ఘాట్‌లో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నందున పోలీసులు, సంబంధిత అధికారులు అక్కడ వేగనిరోధకాలను భారీగా ఏర్పాటు చేశారు. అయితే వేగంగా వెళ్లిన అంబులెన్స్ డ్రైవర్ వేగాన్ని అదుపు చేయలేక ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు.

అచ్చార్ల చెరువు మొరవకు గండి


దెబ్బతిన్న అచ్చార్ల చెరువు మొరవ

రొంపిచెర్ల: మండలంలోని మోటుమల్లెల పంచాయతీ వంకిరెడ్డిగారిపల్లెకు సమీపంలోని అచ్చార్ల చెరువు మొరవ తెగింది. దీంతో చెరువులో నీరంతా వృథాగా పోతుందని రైతులు తెలిపారు. అచ్చార్ల చెరువు కట్ట కూడా బలహీనంగా ఉందని తెలిపారు. చెరువు తూములో గతంలో నీరు రాలేదని కొందరు రైతులు చెరువు తూము పగల గొట్టారని తెలిపారు. దీంతో తూములో నుంచి నీరు వృథాగా పోతుందన్నారు. తూములో మట్టి వేసినా లాభం లేదన్నారు. ఈ చెరువు మోటుమల్లెల పంచాయతీలోనే పెద్ద చెరువుగా పేరు ఉందన్నారు. చెరువు నిండితే చుట్టు పక్కల వ్యవసాయ బోర్లలో నీరు సంవృద్ధిగా ఉంటాయన్నారు. ఈ చెరువుకు తలకోన అడవుల నుంచి నీరు ఎక్కువగా వస్తుందన్నారు. అధికారులు వెంటనే స్పందించి తూముకు ఇసుక బస్తాలను వేస్తే కొంత ప్రయోజనం ఉంటుందని రైతులు తెలిపారు. చెరు వు మొరవను పూర్తి స్థాయిలో నిర్మించలేదన్నారు. కొంత వరకే నిర్మించి మరి కొంత భాగం వదిలి వేయడంతో కోతకు గురై, మొరవ గండి పడి, నీరంతా వృథాగా పోతుందన్నారు. చెరువు తెగితే భారీ నష్టం జరుగుతుందని రైతులు భయందోళన చెందుతున్నారు. అధికారులు ప్రజా ప్రతినిధులు తగు చర్యలు తీసుకుని చెరువు మరమ్మతు పనులకు నిధులు మంజూరు చేయాలని రైతులు కోరుతున్నారు.

కణ్ణన్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ప్రత్యేక తరగతులు పర్యవేక్షిస్తున్న డీవీఈఓ సయ్యద్ మౌలా



విరాల ప్రభుత్వ కళాశాలలో స్టడీ అవర్స్‌లో చదువుకుంటున్న ఇంటర్ విద్యార్థులు



శత సంకల్పం

విద్యార్థికి పది తరువాత ఇంటర్ కీలకం .. యవ్వనదశలో అడుగు పెట్టే విద్యార్థి ఇక్కడ పక్కదారి పడుతున్నాడు. విద్యలో వెనుకంజ వేస్తున్నాడు. ఫలితంగా ఏటా ఇంటర్ ఉత్తీర్ణత శాతం తగ్గుతోంది. ఈ స్థితి మార్చాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ తలచింది. ఇందుకు ఓ బృహత్తర ప్రణాళిక రచించింది. శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ఆ దిశగా అడుగులేస్తోంది. అదే సంకల్ప్ కార్యక్రమం. దీనిపై ప్రత్యేక కథనం.

- ఇంటర్ కళాశాల విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ
- ప్రత్యేక కార్యాచరణ అమలు
- జూనియర్ కళాశాలల్లో సంకల్ప్ అమలు
- ప్రతిరోజూ ప్రత్యేక స్టడీ అవర్స్ నిర్వహణ

జిల్లా సమాచారం

జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలు	31
మొదటి సంవత్సరం విద్యార్థులు	3,493
ద్వితీయ సంవత్సరం విద్యార్థులు	3,501

జూనియర్ ఇంటర్ పరీక్షలు
మార్చి 1 నుంచి 19 తేదీ వరకు

సీనియర్ ఇంటర్ పరీక్షలు
మార్చి 3 నుంచి 20వ తేదీ వరకు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా 31 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల హాజరు శాతం సగం కూడా దాటడం లేదు. దీని ప్రభావం ఉత్తీర్ణతపై చూపి ఫలితాల శాతం తగ్గుతోంది. ఈ విషయాన్ని గుర్తించిన రాష్ట్ర ఇంటర్ విద్యాశాఖ హాజరు పెంపుపై దృష్టి పెట్టింది. ఈ విద్యాసంవత్సరం జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం 3,493, ద్వితీయ సంవత్సరం 3,501 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇప్పటి నుంచి పరీక్షలు పూర్తయ్యే వరకు విద్యార్థులు తప్పనిసరిగా కళాశాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకుంటోంది. గైర్హాజరవుతున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించాలని ఇంటర్మీడియట్ డీవీఈఓ సయ్యద్ మౌలా జిల్లాలోని ప్రభుత్వ కళాశాలల ప్రిన్సిపాళ్లను ఆదేశించారు.

పాఠ్యాంశాల వారీగా..

ఇంటర్మీడియట్ పరీక్షలకు మూడు నెలల సమయం ఉండడంతో ఇంటర్ విద్యాశాఖాధికారులు పాఠ్యాంశాల వారీగా కార్యాచరణ రూపొందించి, అమలు చేస్తున్నారు. ఈ నెలలో పరీక్షలు నిర్వహించి ప్రతి విద్యార్థి స్థాయిని అంచనా వేయనున్నారు. వెనుకపడిన వారిని, ముందున్న వారితో సమానం చేసేందుకు ప్రణాళిక రూపొందించుకుని రెండో నెలలు అమలు చేయనున్నారు. ఇలా పరీక్షల సమయం వరకు అందరూ విద్యార్థులు ఉత్తీర్ణత సాధించేలా చర్యలు చేపడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు 2025 మార్చి ఒకటి నుంచి 19వ తేదీ వరకు, ద్వితీయ సంవత్సరం పరీక్షలు మార్చి 3 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్నారు.

ఉదయం చదువుకునేలా..

జిల్లాలోని అన్ని ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థులను జట్లుగా విభజించి, ఒక్కొక్క జట్టు బాధ్యతలను ఒక్కొక్క అధ్యాపకుడితో అనుసంధానం చేశారు. ఆ జట్టు విద్యార్థులు రోజు కళాశాలకు వచ్చేలా, అన్ని పాఠ్యాంశాల్లో ఉత్తీర్ణత సాధించేలా చేయడం ఆ అధ్యాపకుడిదే బాధ్యత. ఇందులో భాగంగా కళాశాలలోనే కాకుండా ఇంటికి వెళ్లిన తర్వాత చదువుకునేలా, ఉదయం త్వరగా నిద్రలేచేలా చూస్తున్నారు. ఆ సమయంలో చదువుకుంటున్నారా? లేదా అని చరవాణి ద్వారా తెలుసుకుంటున్నారు. స్థానికంగా ఉంటే నివాసాలకు వెళ్లి పరిశీలిస్తున్నారు.

విద్యార్థులు ఒత్తిడి అధిగమించేలా..

విద్యార్థులు పరీక్షల సమయంలో మానసికంగా ఒత్తిడి గురికాకుండా ఉండడంతో పాటు మత్తుపదార్థాలతో కలిగే నష్టాలపై అవగాహన కల్పనకు ప్రతి కళాశాలలో ఒక అధ్యాపకుడిని కౌన్సిలర్‌గా నియమించారు. విద్యార్థులు అధికంగా ఉంటే మరొకరిని నియమించుకోవచ్చు. ఒత్తిడికి గురయ్యే విద్యార్థులను పర్యవేక్షిస్తూ దాని నుంచి వారు బయటపడేలా చూస్తున్నారు.

మరిన్ని కార్యక్రమాలు ..

- డిసెంబర్ నెలఖారుకు సిలబస్ పూర్తి చేయడంపై ప్రతి కళాశాలను డీవీఈఓ సయ్యద్ మౌలా తనిఖీ చేస్తూ, ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులకు పలు సూచనలు చేస్తున్నారు.
- అకాడమిక్ గైడ్స్, మానిటరింగ్ సెల్ ద్వారా కేర్ టేకింగ్ పద్ధతిలో ఒక్కో అధ్యాపకుడికి కొంత మంది విద్యార్థులను అనుసంధానం చేస్తున్నారు. ఆ విద్యార్థులు అన్ని సబ్జెక్ట్‌ల్లో ఉత్తీర్ణత సాధించేలా చేసే బాధ్యత ఆ అధ్యాపకుడిదే.

సంకల్ప్ కార్యక్రమం అమలు

ప్రతి జూనియర్ కళాశాలలో ఉత్తీర్ణత పెంచేందుకు సంకల్ప్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. ఇందులో విద్యార్థులను వారి అభ్యసన సామర్థ్యం, అక్టోబర్‌లో నిర్వహించిన క్వార్టర్లీ పరీక్షల్లో మార్కుల ఆధారంగా 3 కేటగిరీలుగా విభజిస్తారు. మెరుగైన విద్యార్థులను ఏ కేటగిరీ, మధ్యస్థంగా ఉన్న వారిని బీ కేటగిరీ, తక్కువ మార్కులు వచ్చిన వారిని సీ కేటగిరీగా విభజిస్తారు. అర్ధ సంవత్సరం పరీక్షలు, ప్రీ ఫైనల్స్ పరీక్షల మార్కులను ఆధారంగా వారి కేటగిరీల్లో కూడా మార్పులు చేస్తారు. సాయంత్రం 3 నుంచి 5 గంటల వరకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తారు.

ప్రతి విద్యార్థిపై శ్రద్ధ



జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఉత్తీర్ణత పెంచాలనే లక్ష్యంతో ఉన్నతాధికారులు సంకల్ప్ అనే కార్యక్రమం అమలు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమం ప్రతి కళాశాలలో అమలయ్యేలా చర్యలు చేపడుతున్నాం. నిత్యం క్షేత్రస్థాయిలో జూనియర్ కళాశాలలను పర్యవేక్షించి అక్కడి పరిస్థితులను పరిశీలిస్తున్నాను. ప్రభుత్వ కళాశాలల్లో సరైన బోధన, శిక్షణ ఇచ్చి ఉత్తీర్ణత పెంచేందుకు కృషి చేస్తున్నాం. జేఈఈ, నీట్‌కు కూడా సంకల్ప్ కార్యక్రమంలోనే శిక్షణ ఇవ్వడం జరుగుతోంది. ప్రతి విద్యార్థిపై శ్రద్ధ తీసుకుని ఉత్తీర్ణులు అయ్యేందుకు చర్యలు చేపడుతున్నాం.

– సయ్యద్ మౌలా,
ఇంటర్మీడియట్ డీవీఈఓ, చిత్తూరు జిల్లా.

పక్కాగా గుర్తింపు కార్యక్రమం


మాట్లాడుతున్న సీఈఓ రవికుమార్‌నాయుడు

చిత్తూరు కార్పొరేషన్: కేంద్ర ప్రభుత్వం, అలింకో సంస్థ ఆధ్వర్యంలో చేపడుతున్న సర్వే కార్యక్రమాన్ని పక్కాగా చేయాలని జెడ్పీ సీఈఓ రవికుమార్ నాయుడు తెలిపారు. శుక్రవారం జెడ్పీ కార్యాలయంలో ఎంపీడీఓలతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఈ నెల 17 నుంచి 24వ తేదీ వరకు అర్హులైన దివ్యాంగులు, వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులకు అవసరమైన పరికరాల గుర్తింపు కార్యక్రమం జరుగుతుందన్నారు. తదనంతరం సంబంధితదారులకు కృత్రిమ అవయవాలు, చేతి కర్రలు, వీల్‌చైర్లు, వినికిడి యంత్రాలు, బ్యాటరీ ట్రైసైకిళ్లు, టచ్‌ఫోన్లు అందించడం జరుగుతుందన్నారు. శిబిరాల్లో సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. 17న చిత్తూరులోని పీసీఆర్ ప్రభుత్వ పాఠశాల, 18న ఎస్ఆర్‌పురం జెడ్పీ హైస్కూల్, 19న పూతలపట్టు జెడ్పీ హైస్కూల్, 20 నగరి పీవీఎన్‌సీ ప్రభుత్వ బాలుర హైస్కూల్, 21న పుంగనూరు బీఆర్ ప్రభుత్వ హైస్కూల్, 22న పలమనేరు జెడ్పీ హైస్కూల్, 23న కుప్పంలోని రాజువారి పార్కు వద్ద, 24న రామకుప్పం జెడ్పీ బాలుర హైస్కూల్లో శిబిరాలు జరుగుతాయన్నారు. శిబిరానికి వచ్చే వారు ఆధార్, సదరం, రేషన్ కార్డు, ఆదాయ ధ్రువీకరణపత్రాలు రెండు సెట్ల జిరాక్స్, 4 ఫొటోలు వెంట తీసుకుని రావాలన్నారు.

16 నుంచి ధనుర్మాస తిరుప్పావై ప్రవచనాలు

తిరుపతి కల్చరల్ : పవిత్ర ధనుర్మాసాన్ని పురస్కరించుకుని ఈ నెల 16 నుంచి వచ్చే ఏడాది జనవరి 13వ తేదీ వరకు తిరుపతితోపాటు దేశ వ్యాప్తంగా 232 కేంద్రాల్లో ప్రముఖ పండితులతో తిరుప్పావై ప్రవచనాలు నిర్వహించనున్నట్టు అధికారులు తెలిపారు. ఇందుకోసం టీటీడీ ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. తిరుమల శ్రీవారి ఆలయంలో ధనుర్మాసంలో సుప్రభాతం బదులు తిరుప్పావై నివేదించడం విశేషం. తిరుపతిలో అన్నమాచార్య కళామందిరం, కేటీ రోడ్డులోని వరదరాజ స్వామివారి ఆలయంలో తిరుప్పావై ప్రవచనాలను పారాయణం చేస్తారు. 12 మంది ఆళ్వారుల్లో ఒకరైన శ్రీగోదాదేవి ధనుర్మాసం వ్రతం చేశారు. ద్వాపరయుగంలో గోపికలు ఈ వ్రతాన్ని ఆచరించి శ్రీకృష్ణుని కృపకు పాత్రులయ్యారని భాగవతం దశమ స్కందంలో ఉంది. ఈ వ్రతం ఎలా ఆచరించాలనే విషయాన్ని గోదాదేవి 30 పాశురాలతో కూడిన తిరుప్పావై దివ్యప్రబంధాన్ని లోకానికి అందించారు. ఈ వ్రతాన్ని అందరూ కలి సి చేస్తే గొప్ప ఫలితం ఉంటుందని పండితులు చె బుతున్నారు. ఈ సంప్రదాయం ప్రకారం దేశవ్యా ప్తంగా ఉన్న అన్ని వైష్ణవ ఆలయాల్లో తిరుప్పావై శాత్తుమొర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

ప్రాణాలు పణంగా పెట్టి ..


ఎస్‌బీఆర్‌పురం చెరువులో బోటుపై 11 కేవీ లైన్ మరమ్మతులు చేస్తున్న విద్యుత్ సిబ్బంది

అల్పపీడనం కారణంగా ఎస్‌బీఆర్‌పురం చెరువులో ఉన్న 11కేవీ లైన్ గురువారం పాడైంది. దీంతో దిగువ లోతట్టు ప్రాంతాల్లో రెండు రోజులుగా కరెంట్ లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అయితే ఎడతెరిపి లేకుండా వర్షాలు కురవడంతో మరమ్మతులు చేయడానికి వాతావరణం సహకరించలేదు. దీంతో శుక్రవారం పుత్తూరు ఏఈ జయసాయి ఆధ్వర్యంలో లైన్‌మన్ వేణు, జేఎస్ఎం అశోక్ బోటు సాయంతో చెరువులో ఉన్న 11 కేవీ మెన్‌లైన్‌కు మరమ్మతులు చేసి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.

– వడమాలపేట(విజయపురం)

చదరంగ రారాజు గుకేశ్

- చెస్ పోటీల్లో గెలుపుపై విజయోత్సవం

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన దొమ్మరాజు గుకేశ్ పిన్న వయస్సులోనే చదరంగ రారాజుగా అవతరించడం జిల్లాకే గర్వకారణమని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బాలాజీ అన్నారు. శుక్రవారం జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కార్యాలయం వద్ద బాణసంచా పేల్చి విజయోత్సవం జరుపుకున్నారు. ఆయన మాట్లాడుతూ చిన్నవయసులోనే ప్రపంచ చెస్ చాంపియన్‌గా గుకేశ్ అద్భుత విజయం సాధించడం చారిత్రాత్మకమన్నారు. నేటి క్రీడాకారులు గుకేశ్‌ను స్ఫూర్తిగా తీసుకుని క్రీడల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఖోఖో అసోసియేషన్ కార్యదర్శి శరత్, పీడీలు, పీఈటీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

18 ఏళ్ల కుర్రాడు చెస్‌లో రాణించడం అభినందనీయం

చిత్తూరు కలెక్టరేట్ : ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్ పోటీల్లో 18 ఏళ్ల కుర్రాడు గుకేశ్ 32 ఏళ్ల క్రీడాకారుడితో పోరాడి గెలిచిన తీరు అభినందనీయమని ఏపీ చెస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్ఆర్‌బీ ప్రసాద్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని చెస్ అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగపూర్‌లో జరిగిన చెస్ చాంపియన్‌షిప్ తుదిపోరులో గుకేశ్ అద్భుత విజయం సాధించారన్నారు. అతను ఉమ్మడి చిత్తూరు జిల్లా వాసి కావడం ఆనందదాయకమని చెప్పారు. అతన్ని నేటితరం విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకుని జిల్లా నుంచి మరింత మంది చెస్‌లో గ్రాండ్ మాస్టర్లుగా ఎదగాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను చెస్ క్రీడ వైపు మక్కువ పెంచుకునేలా ప్రోత్సాహం కల్పించాలన్నారు. ఈ సమావేశంలో అసోసియేషన్ నాయకులు ఆదినారాయణ, బాలుసోమ్‌నాథ్, దినేష్, జయకుమార్, శ్రీనివాసులు, బాల, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


సంబరాలు జరుపుకుంటున్న క్రీడా సంఘాల సభ్యులు

భక్తిశ్రద్ధలతో కార్తీక దీపోత్సవం


శివలింగాకారంలో వెలిగించిన దీపాలు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలో శుక్రవారం కార్తీక దీపోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గిరింపేటలోని శ్రీ చిదంబరేశ్వర స్వామి ఆలయంలో ఉదయం అభిషేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని, తరించారు. దీపారాధన చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే దుర్గానగర్ కాలనీలోని శ్రీ వినాయకస్వామి ఆలయంలో శివలింగాకారంలో దీపాలు వెలిగించారు. దొడ్డిపల్లిలోని సప్తకనికలమ్మ ఆలయంలో అమ్మవారిని విశేషంగా అలంకరించారు. రాత్రి దీపోత్సవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి దీపారాధన చేశారు. అన్నదానం చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పూతలపట్టు(కాణిపాకం): పూతలపట్టు మండలంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు.. తిమ్మిరెడ్డిపల్లి వద్ద రఘునాథయ్య(65) అనే వ్యక్తి పాలు తీసుకుని రోడ్డు దాటుతుండగా ఓ లారీ వేగంగా వచ్చి ఢీకొంది. దీంతో ఆయన తీవ్రగాయాలపాలయ్యాడు. వెంటనే స్థానికులు చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కొద్ది సేపటికే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

సాగునీటి సంఘాలవే‘ఢీ’

జిల్లాలో సాగునీటి సంఘాల ఎన్నికల వేడి రగులుతోంది. ఈ ఎన్నికల్లో ఆధిపత్యం కోసం కూటమి కుట్రలు పన్నుతోంది. నో డ్యూస్ మెలిక పెట్టింది. అయినా 220 కేంద్రాల్లో పోలింగ్‌కు తెరలేస్తోంది. అయితే ఎన్నికలు సజావుగా సాగడానికి మొత్తం 2,521 మంది సిబ్బంది సమాయత్తం అయ్యారు. పైచేయి ఎవరిదో వేచిచూడాల్సి ఉంది.

- ఏర్పాట్లు పూర్తి చేసిన జిల్లా యంత్రాంగం
- ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు
- జిల్లాలోని 31 మండలాల్లో 220 సాగునీటి సంఘాలకు ఎన్నికలు
- పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు


నగరిలో సాగునీటి ఎన్నికల పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేసిన పాఠశాల భవనం

చిత్తూరు కలెక్టరేట్ : ఏపీఎఫ్ఎంఐఎస్ చట్టం 1997, 2018వ సంవత్సరం సవరణ చట్టం ప్రకారం జిల్లా వ్యాప్తంగా ఈ నెల 14వ తేదీన సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ ఎన్నికలకు అవసరమైన అన్ని ఏర్పాట్లను జిల్లా యంత్రాంగం పూర్తి చేసింది. జిల్లాలోని 31 మండలాల్లో 215 చిన్న నీటి వినియోగదారుల సంఘాలకు, కార్వేటినగరం మండలం కృష్ణాపురం ప్రాజెక్టు పరిధిలో 5 మొత్తం 220 సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమయ్యే ఎన్నికలు సాయంత్రం 5 గంటలకు ముగియనున్నాయి. ఈ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఇద్దరు చొప్పున పోలీసులను బందోబస్తుకు నియమించనున్నట్లు అధికారులు వెల్లడించారు.

220 పోలింగ్ స్టేషన్లు

జిల్లా వ్యాప్తంగా శనివారం నిర్వహించే సాగునీటి సంఘాల ఎన్నికలకు 220 పోలింగ్ స్టేషన్లను అన్ని మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేశారు. ఈ పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బందిని నియమించారు. ఈ ఎన్నికలకు ఈఓ, ఏఈఓ, పీఓ, పీఏలు మొత్తం 2,521 మంది విధులు నిర్వహించనున్నారు. ఈ ఎన్నికలు ఓటింగ్ స్లిప్పుల విధానంలో నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. 49,030 మంది ఓటర్లు సాగునీటి సంఘాల ఎన్నికల్లో ఓటు హక్కును సద్వినియోగం చేసుకోనున్నట్లు అధికారులు వెల్లడించారు.

అడ్డదారుల్లో గెలిచేందుకు కూటమి కుట్రలు

ఈ ఎన్నికల్లో ఎలాగైనా గెలిచేందుకు టీడీపీ కూటమి ప్రభుత్వం అడ్డదారులు తొక్కుతోందన్న విమర్శలున్నాయి. సాగునీటి రంగంలో రైతుల భాగస్వామ్యంతో ప్రతి ఎకరాకు నీరందించేందుకు ఈ ఎన్నికలు నిర్వహిస్తున్నారు. జిల్లాలో కీలకంగా ఉన్న చెరువులు, జలాశయాల పరిధిలోని సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఏకపక్షంగా తమకు అనుకూలంగా ఉన్న వారికి మాత్రమే ఓటు హక్కు కల్పించుకునేందుకు కుట్రలు చేస్తున్నారని సమాచారం. నిబంధనల ప్రకారం సాగునీటి సంఘాల ఎన్నికలకు ఆయకట్టుదారులకు ఇరిగేషన్ అధికారులు ఓటు హక్కు కల్పించాల్సి ఉంటుంది. అయితే నిబంధనలను పాటించకుండా కూటమి ప్రజాప్రతినిధుల ఆదేశాల మేరకు ఇరిగేషన్ అధికారులు అనర్హులకు ఓటు హక్కు కల్పిస్తున్నట్లు విమర్శలున్నాయి.

నో డ్యూస్ సర్టిఫికెట్ ఇవ్వకుండా కుట్రలు

అధికారబలంతో టీడీపీ కూటమి ప్రభుత్వం ఎత్తుగడలకు పాల్పడుతోంది. ఎలాగైనా సాగునీటి సంఘాల ఎన్నికల అధికారం చేపట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. పోలీసు, రెవెన్యూ సిబ్బందిపై ఒత్తిడి తెస్తూ తమదారిలో పెట్టుకుని ఇతరులకు ఎన్నికల్లో అవకాశం కల్పించకుండా కుట్రలకు పాల్పడుతున్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా జరగాల్సిన ఎన్నికలు సైతం ఏకపక్షంగా చేసుకునేందుకు అవసరమైన అన్ని కుట్రలను అధికార పార్టీ ప్రయోగిస్తోంది. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రతిపక్ష పార్టీకి అవకాశం లేకుండా చేసేందుకు అడ్డదారుల్లో వెళుతూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు. ప్రధానంగా ఎన్నికలకు అవసరమైన నో డ్యూస్ సర్టిఫికెట్ నగరి, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు నియోజకవర్గాల్లో పలువురికి ఇవ్వకుండా కుట్రలకు పాల్పడ్డారని సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.